# మాక్లీ దుర్గంలో కుక్క

(ప్రతిభ - ఆగస్టు 1936)

**మా**క్లీ దుర్గం రైలుస్టేషను గుంటకల్లు నుంచి బెంగుళూరు పోయే త్రోవలో నాల్గు స్టేషనుల కివతల నున్నది. ప్లాటుఫారం కన్న రైలుస్టేషను పదిగజాలు ఎక్కి వెళ్ళాలి. రైలు రోడ్డు ప్రక్కనే పెద్ద కొండ వున్నది. దాని నిండా చెట్లూ చేమలూ, రాళ్ళూ, రప్పలూ ఉన్నవి. అప్పుడప్పుడు వేగోలాలు, సివంగులు రాత్రిళ్ళు స్టేషనులోనికి వస్తూ ఉంటవి. స్టేషనుకి వెనుక పెద్ద లోయ కవతల తట్టు నున్న కొండమీద నెవరిదో భాగ్యవంతులది పెద్ద సౌధం ఉంది. ఈ లోయలో రెండు మూడు వాగులున్నవి.

మాక్లీ దుర్గం స్టేషను చాలా చిన్నది. అందులో ఒక చిన్న అంగడి వుంది. రైళ్ళు వచ్చే వేళకూ, పోయే వేళకూ అంగడి తెరచి ఉంటుంది. ఒక కుక్క అంగడి తెఱచినప్పుడల్లా అక్కడ తయారు. అంగడి ఎత్తుగా ఉంటుంది. కుక్క–తన చూపు అంగడిలోని పళ్ళికలలో ఉన్న మిఠాయి మీద పడే అంత సమరేఖలో నుంచుని – ఊర్ధ్వదృష్టితో తపస్సు చేస్తుంది. ఎప్పుడైనా వాడంగడి సర్దేటప్పుడైనా, యెవడైనా కొనుక్కొనేటప్పుడైనా, ఒక చిన్న ముక్క జారిపడుతుందేమో అని యెదురు చూస్తూ ఉంటుంది. వారానికో, పదిరోజులకో, అట్లా యెప్పుడూ పడదు గాని పదిరోజుల క్రింద చేసిన పకోడీ, కొనుక్కున్నవాడు చద్దివాసన వేసి పారేస్తే, కుక్క దానిని తన నోటితో అగావుగా పట్టుకొని ముందు పళ్ళతో నొక్కి అంగిట్లోకి పోయేందుకు రెండు గతుకులు గతికి మ్రింగి దగ్గు వచ్చి మళ్లీ కక్కుతుంది. రైలు వెళ్ళిపోవటంతోటే ఆ అంగడివాడు మూస్తాడు. కుక్క పోయి సెలయేట్లో నీళ్ళు తాగుతుంది. ముందుకాళ్ళు చాచి గడ్డిమీద పడుకొని లేత గరికపోచలు కొరుకుతుంది. ఆ కుక్క మంచి మిడుతల వేటగాడు. అప్పుడప్పుడు పొలము పిచ్చుకలను గూడా పట్టుకొంటుంది. సెలయేటి నీళ్ళూ, మంచిగాలి, లోయలోకి దిగటం ఎక్కటం; కుక్క మంచి దేహపటుత్వంలో ఉన్నది. కుక్క చెదరియైనా స్టేషనెదురుగా నున్న కొండమీదికి పోదు.

ఒకసారి ఒక పెద్దమనిషి ఒక ఆడసీమ కుక్కను స్టేషనులోకి తెచ్చాడు. వాటి రెంటికీ ప్రథమ దర్శనంలోనే ప్రణయం ఏర్పడ్డది. ఆ పెద్దమనిషి చేతిలో ఒక చేతికఱ్ఱ ఉంది. దాన్ని చూచి మనకుక్క తన ప్రియురాలి దగ్గరకు వెళ్ళింది కాదు. పుట్టింట ఉన్న ఆడపిల్ల వలె సీమకుక్క మాత్రం నిర్భయముగా తన అనుకుంటారేమో నని దుర్గపుకుక్క దానివంక చూడకుండా చూడటం మొదలుపెట్టింది. పెద్దమనిషి తన కుక్కను కటకటాలకు కట్టివేసి సామానులు తూయించు కోటానికో దేనికో వెళ్ళాడు. రెండు కుక్కలూ కలసికొన్నవి.

స్టేషనుమాస్టరు కొంచెము చదువుకొన్నవాడు. పెద్దమనిసికీ ఆయనకీ ఆధునిక సిద్ధాంత రాద్ధాంతాల చర్చ జరుగుతోంది.

**స్టే.మా** : కాదండీ! వర్ణవ్యవస్థ ఉండాలి. మన పూర్వులు దానిని నియమించారు. వాళ్ళు ఏ ప్రయోజనం కోసం దాని నేర్పరచారో ఆ ప్రయోజనాలు తెలియకుండా మనం వానిని తీసివేయరాదు.

**పె.మ** : అట్లా అంటే లాభం లేదండీ! ఆ సిద్ధాంతాలేమిటో చెప్పండి. 'మనవాళ్ళు చెప్పారు కదా అని' వినే రోజులు పోయినై. ప్రతిదీ వాదానికి నిలవాలి. వాదానికి నిలవంది మేము ఒప్పుకోము.

**స్టే.మా** : వారు ఏ ప్రయోజనాలర్థించారో మనకు తెలియదు. మనకు వాటిని తెలుసుకునేటంత మేధాశక్తీ లేదు.

**పె.మ** : దానికి నే నొప్పుకోను. జ్ఞానము ప్రపంచం నడిచినకొద్దీ వృద్ధి అవుతోంది గాని తగ్గడంలేదు. మన పూర్వులకు మనకున్నంత వాదనాశక్తి లేదంటాను. మానసికశాస్త్రం, పదార్థ విజ్ఞానశాస్త్రం ఇప్పుడు వృద్ధి అయినంత పూర్వం వృద్ధికాలేదు.

**స్టే.మా** : అయితే మీరు వర్ణవ్యవస్థ తీసిపారవేయాలి అంటారా?

**పె.మ** : తీసివెయ్యాలంటాను. ఈ వ్యవస్థ మూలంగా అనేక భేదాలేర్పడుతున్నవి. కొందరనవసరంగా తాము గొప్పవాళ్ళ మనుకొంటున్నారు. తక్కువ కులాలమీద అధికారం చలాయిస్తున్నారు. వర్ణాంతర భోజనములూ, వివాహములూ జరుగవలె. అప్పుడే దేశానికి ముక్తి.

**స్టే.మా** : సర్వభూతములయందు సమత్వం ఉండాలిసిందే కాని వర్ణాంతర వివాహం నేను ఒప్పుకోను. పైకి కనబడే భేదాలు మనసా లేకుండా చేసుకోవాలి. మన పూర్వులు కూడా అదే చెప్పారని నా ఉద్దేశం.

**పె.మ** : మనవాళ్ళట్లాగూ చెప్పలేదు. మనవాళ్ళు సంఘానికి చేసిన ద్రోహం అంతా ఇంతా కాదు.

పెద్దమనిషి బయటకు వచ్చాడు. తన కుక్క వంక చూచాడు. రెండు కుక్కలూ వర్గభేదం మఱచిపోయి కలుసుకొంటున్నవి. పెద్దమనిషి పరుగెత్తుకొనిపోయి దుర్గపు కుక్కను పదిపదకొండు దెబ్బలు కొట్టాడు. 'జ్ఞాతాస్వాద' మైన ఆ కుక్క వదలిపెట్టుటకు సమర్థము కాక చివరకు వదలించుకొనిపోయింది. స్టేషను బయటకు పోవు వరకు కుక్కకు తెలిసింది. తన ఒక తొంటి విరిగినదని. ఆ పెద్దమనిషి తన కుక్కను కూడా నాలుగు మోదినాడు.

స్టేషనుమాస్టరీ గందరగోళం విని బయటకు వచ్చాడు. సంగతంతా తెలిసికొన్నాడు. 'అయ్యా! ఎందుకు కుక్కనట్లా కొట్టారు?'

**పె.మ** : ఇది జాతిగల కుక్క. దీనికి తోడు మగకుక్కను కొనవలెనని చాల ప్రయత్నం చేశాను. దొరకలేదండీ! దీనికి ఋతువు వచ్చింది. దీన్ని బెంగుళూరు తీసుకొని పోతున్నాను. ఈ జాతి మగకుక్కతో కలపవలెనని.

స్టేషనుమాస్టరు కొంచెము నవ్వాడు. పెద్దమనిషి కనుబొమల మీద మాత్రం కొంచెం నల్లనిరేఖ యేర్పడ్డది. ఆయన నవ్వాడు.

తరువాత మళ్ళీ యిద్దరూ స్నేహంగా మాట్లాడుకొన్నారు. స్టేషనుమాస్టరు సీమకుక్క అందానికీ, మొగాన మచ్చకూ, తోక కుచ్చుకూ, దాని గోధుమవన్నె రంగునకూ మిక్కిలి మెచ్చుకొని దాన్ని ముద్దాడాడు. 'దీనికి పిల్లలు పుడితే నాకో పిల్లను తప్పకుండా ఇవ్వా'లని వాగ్దానం చేయించుకొన్నాడు.

ఊరకుక్క సంపర్కం చేత సీమకుక్క ఒళ్ళంతా మన్నయింది. అంతకుముందే వానకురిసి ప్రక్కనున్న పెద్ద బండలమీద నీటిపడెలు కట్టినై. పెద్దమనిసి తన తోలుపెట్టె తెఱచి రెండుదికిన తువ్వాళ్ళూ, సబ్బుబిళ్ళా తీసి ఆపడెలో కుక్కను అభ్యంగనము చేయించి తువ్వాళ్ళతో దాన్ని చక్కగా తుడిచాడు.

ఇంతలో రైలు వచ్చింది. ఆయన కంయి కంయి మని అఱచుచున్న కుక్కను తువ్వాల్లో చుట్టి చంకన పెట్టుకొని రైల్లో ఎక్కాడు. మగకుక్క ఆడకుక్కకు దూరంగా నిలుచుండి కుంటుతూ దానివంకనే సాకూతంగా చూడడం మొదలుపెట్టింది. ఆయన కిటికీలోనుంచి తొంగిచూచి కుక్క వైపునకు రెండుసార్లు కఱ్ఱ ఆడించాడు. అది మరీ దూరం పోయింది.

రైలుసాగింది. సీమకుక్క కంయి కంయి మని తలుపు దగ్గరకు పోతుంది. తొంగిచూస్తుంది. అతడు గొలుసుతో లాగి పట్టుకుంటాడు. రైలు బెంగుళూరు పోయిన తరువాత కుక్క ఏడుపు మానేసి యజమాని దగ్గర చనువుగా కూర్చుంది. అతడు దానిని ఒళ్ళోకి తీసికొని 'లీలా! అల్లా చేయవచ్చునా?' అని దానినోట్లో నోరు పెట్టి ముద్దు పెట్టుకొన్నాడు. ఇందాకటి కుక్క యీ పనే చేస్తే అంత హృదయంగమంగా ఊరుకొన్న ఆ కుక్క పరపురుష చుంబనం పరిహరించినట్లుగా అతని చుంబనం పరిహరించింది.

**(2)**

దుర్గములో కుక్క తన తొంటి గాడిద గడపాకునకూ, అడ్డసరపాకులకూ వేసి రుద్దుకొని, సెలయేటి ఒడ్డున నున్న ఒండు మంటిలో అద్దుకొని, పదిహేను రోజులకు కాలు సరిచేసికొంది. మళ్ళీ స్టేషనులోనికి వస్తున్నది. మిఠాయి దుకాణం వంక చూస్తున్నది.

ఒకనాడు ఇద్దరు విద్యార్థులు అక్కడికి వచ్చి దుకాణంలో యేదో కొనుక్కొని తింటూ బల్లమీద కూర్చున్నారు. వాళ్ళ యిద్దరి మాటలూ కుక్క చెవిన పడ్డవి.

**ఒకడు** : మనదేశంలో భూతదయ అన్నది లేదు. పెద్దవాళ్ళందరూ పిన్నవాళ్ళమీద అధికారం చేస్తారు. నేను బి.ఏ ప్యాసైనాను. ఉద్యోగమిచ్చే దిక్కులేదు. పేదవాళ్ళు మలమల మాడిపోతున్నారు. గొప్పవాళ్ళు సోఫాలమీద కాని ఒరగరు.

**రెండవ** : మనవాళ్ళు అందరూ స్వార్థపరులే. పిడికెడు బిచ్చం పెట్టరు. చివరకు కుక్కకు వేసినట్లైనా పేదవాళ్ళకింత వెయ్యరు.

కుక్క వాళ్ళదగ్గరకు వచ్చి వాళ్ళ చేతిలో పొట్లం వంక చూచింది. వాళ్ళిద్దరూ ఇంగ్లీషులో మాట్లాడుకుంటున్నారు. అందులో ఒకతని కాళ్ళకు బూట్లు ఉన్నవి. కాలిమీద కాలు వేసుకు కూర్చున్నాడు. ఆ బూటు కాలితో కుక్కను డొక్కలో తన్నాడు. దానిని రెండు మూడు రోజులనుంచీ తిండిలేదు. ఆ దెబ్బ పొట్టలో ఏ నరానికి తగిలిందో అది మెలికలు తిరిగి పోయింది. కొంతసేపటి కది తెప్పిరిలి లేచిపోతోంది. రెండవ విద్యార్థి తన చేతిలోది కొంచెం దాని ముందర వేశాడు. అది నొప్పి చేత దానికి ముట్టుకోకుండా పోయింది.

ఆరోజు సాయంత్రం కొండమీది నుంచి ఒక వేగోలం దిగి రాత్రిపూట స్టేషనులోకి వచ్చింది. కుక్క భయపడి దుకాణం క్రింద ఒక గూడుగా వుంటే దానిలో దాక్కుంది. అర్ధరాత్రి వేళ స్టేషనంతా నిర్జనంగా ఉంది. వేగోలం పసిపట్టి ఆ గూటి దగ్గర కాపలా వేసింది. వేగోలం మూతి గూట్లోకి పెడితే కుక్క లోపల దాక్కొని దాని నోరంతా కరచింది. వెనక్కు తిరిగితే తోకా పృష్ఠభాగం గాట్లు చేసింది. వేగోలం మైమఱచి ఉంటే కొంచెం బయటికి వచ్చి దాని మెడ పట్టుకొని గుంజింది. అది కరవవస్తే తను గూట్లో దాక్కుంటుంది. ఇట్లా మూడు నాలుగు గంటలు దాగుడుమూతల యుద్ధం చేసి ఒక ఒడుపులో వేగోలం పీక పట్టుకొని దాని ఊపిరి ఆగేదాకా కుక్క వదలలేదు.

తెల్లవారిన తరువాత అందరూ వచ్చారు. కుక్క పౌరుషం చూశారు. ఏడాది రెండేండ్లుగా మర్యాదలేని ఆ కుక్కకు, ఆనాటితో మర్యాద యెక్కువైంది. స్టేషనుమాస్టరు దానికి రోజూ అన్నం వేయమని ఫర్మానా యిచ్చాడు. ఆరోజు సాయంకాలం అంగడివాడికి మహోదయ కలిగింది. ఒక్క బూందీపూస బీరువోనియ్యని ఆ పిసినిగొట్టు సంవత్సరము నుండీ పరిశిష్టపు నూనెతో పరిశిష్టంగా వస్తున్న మిఠాయి జంగిలీ దాని ముందర పెట్టాడు. ఆ మిఠాయి మరెవ్వరూ కొనరు. ఎవ్వరూ కొనకపోవటం వలన వారానికొకసారి తాజాగా నూనెలో వేస్తున్నా ఎవ్వరూ కొనలేదు. కుక్క మీద మహోదయ పుట్టి, ఆ జంగిలీ దాని ముందర పెట్టాడు. అది తిన్నది. ఆప్యాయంగా తిన్నది. ఆ మరునాడు రాత్రి కుక్క తెల్లవార్లూ మహాబాధ పడుతున్నట్టుగా ఏడవటం మొదలుపెట్టింది. ఇంట్లో పడుకొన్న స్టేషను మాస్టరూ, పోర్టర్లూ వేగోలాలు వచ్చినై అనుకొన్నారు.

కుక్క పగలు పోయి పొలాలమీదా, అడవులమీదా తిరిగివస్తుంది. దానికేదో మహావాతం పుట్టింది. కనపడ్డ ఆకల్లా కొరికింది. ఏ ఆకూ పనిచెయ్యలేదు. ఒందుమట్టి నాచేత కాదంది. సెలయేటి నీళ్ళు ఇది మా పని కాదన్నవి. రాత్రిళ్ళు స్టేషనులోపడి యేడుస్తుంది. మెలికలు తిరిగిపోతుంది. తన నడుము రైలు కింద పడ్డట్లు గోలకెత్తుతుంది. వారము రోజులీ రీతిగా కొట్టుకులాడి దాని వ్యాధి ఉపశమించింది. రెండురోజులుపవాసం ఉండి కూడ వేగోలాన్ని చంపిన యీ కుక్క వారము రోజులయ్యేటప్పటికి చిక్కి శల్యమయింది. దానివెనుక కాళ్ళూ మొత్తా తప్పబడి పోయినవి. అది యెక్కడో ఒకచోట పడుకొని మూలగడానికి కూడా ఓపిక లేకుండా సన్నగా యేడుస్తుంది. దానికి మిఠాయి అంగడి అంటే భయం వేసింది. అంగడి వైపుకు పోదు. అంగడి వంక చూడదు. మునుపు స్టేషనులో యథేచ్ఛంగా తిరిగేది. స్టేషను మాస్టరు గదిలోకి పోయి తొంగిచూస్తే చీడకుక్క, పేలకుక్క అని దాన్ని కొట్టడం మొదలుపెట్టారు.

ఆరునెలలైంది. ఆ కుక్క చావదూ, బ్రతకదు. ఒకరోజు సీమకుక్కను తెచ్చిన మనిసి వచ్చాడు. మాస్టరూ, ఆయన పూర్వపు పరిచయాన్ని మగిడించుకొని మాట్లాడుకొన్నారు. మాస్టరు, "ఏమండీ! కుక్క పిల్లలను పెట్టిందా?" అని అడిగాడు. పెద్దమనిషి ఇట్లా అన్నాడు. "అయ్యా! కుక్కను బెంగుళూరుకు తీసుకు వెళ్ళాను. జాతికుక్క నెక్కనివ్వలేదు. మీ పాడుకుక్క పాడుచేసింది. కుక్కపిల్లల్ని కన్నది. ఊరకుక్కల్ని పెట్టింది. నాకు చాల విచారం వేసింది. ఈ సారి మంచిపిల్లలు పెడితే మీకు తెచ్చిస్తా" నన్నాడు. స్టేషనుమాస్టరు "మా కుక్క మంచిదండీ! అది మంచి పౌరుషశాలి. కొన్నాళ్ళక్రింద అది ఒక వేగోలాన్ని చంపిం"దన్నాడు. పెద్దమనిషి "పోనిద్దురూ! వెధవకుక్క. నాకు దానిని చంపవలెనని ఉంది. ఇంకా అది మీ స్టేషనులో ఉంటే చూపించండి. దాన్ని నరికి పోతా"నన్నాడు. స్టేషనుమాస్టరు "దానికేదో వాతం పుట్టి కుక్క పాడైపోయిం"దన్నాడు.

ఇంతలో ఆ కుక్క యీడ్చుకుంటూ అక్కడికి వచ్చింది. స్టేషను మాస్టరు ఇదేనండీ అని చూపించాడు. పెద్దమనిషి కోపముతో చీదరించుకొని దానిని కాలితో విసురుగా తన్నినాడు. అది పారిపోలేక అక్కడే ఒక పక్క కొత్తిగిలి మెడా కాళ్ళూ యెత్తి యేడ్చింది. పోర్టరు వచ్చి కాలితో దాన్ని అవతలికి తోశాడు. మాస్టరుగారు నవ్వి "మీకెంత కోపమండీ" అన్నాడు.

వారి ఇద్దరి స్నేహమూ బలిసి ఆ రాత్రి పెద్దమనిషి స్టేషను మాస్టరు గారికి అతిథిగా నుండిపోయినాడు. ఆనాటి రాత్రి కుక్క రైలు క్రింద పడ్డది. రైలు దాని నడుము మీద నుండి పోయింది. "అంగ వ్రాతములో జికిత్సకుడు దుష్టాంగమ్ము ఖండించి" నట్లు రైలు వ్యాధిగ్రస్తమై నష్టశక్తియైన దాని పశ్చార్ధమును ఖండించినది. కాని శేషాంగశ్రేణికి రక్షలేక అది ఒక అరగంట తన్నుకొని చచ్చిపోయింది.

తరువాత నాల్గు నెలలకు ఆ పెద్దమనిసి తన రెండు కుక్కపిల్లలతో ఒకటి చచ్చిపోయిందని చెప్పి రెండవదాన్ని స్టేషనుమాస్టరు గారి కిచ్చాడు. అది ఆరునెలలు యెదిగి మరల తన తండ్రివలెనైనది. దానికి భయము లేదు. ఎదురుగా నున్న కొండమీదికి షికారు పోయివస్తుంది. ఎవరన్నా దానికి మిఠాయి పెట్టబోతారు. అది వాళ్ళకు పళ్ళు చూపించి కఅవవస్తుంది. ఎన్ని ఆడకుక్కలు వచ్చినా వాటివంక చూడదు. అది పిల్లవేగోలాలనూ, కుందేళ్ళనూ, నక్కలనూ వేటాడుతుంది. విద్యార్థులు వచ్చి భూతదయోపన్యాసములు చేస్తుంటే వాళ్ళవంక ఓరగా తిరస్కారముగా చూస్తుంది. ఆ పెద్దమనిషి వచ్చి వర్ణవ్యవస్థను గూర్చి స్టేషను మాస్టరుతో మాటాడుతూ ఉంటాడు. ఈ కుక్క వస్తే దానిని ముద్దుగా ముట్టుకోబోతాడు. అది కోపంగా పళ్ళు చూపించి జీర్ణం కాని వేగోలపు మాంసం కక్కిపోతుంది. రైలు మైలు దూరమున్నదనగా ముక్కుకోళ్ళతో శ్వాస ఎగలాగి పసిపట్టి సీదరించుకొని తొలగిపోతుంది.

మిఠాయి దుకాణము వాడొకనాడు చద్ది మిఠాయి దాని ముందర వేయబోయినాడు. అది వాడి పిక్క కండలు పట్టి లాగింది. దానికి మనుష్యుల్ని చూస్తే వెగటు వేసింది కాబోలు!కొన్నాళ్ళకి జనసమ్మర్ధమైన స్థలాన్ని వదలి అడవుల్లోనే ఉంటూ వచ్చింది. అప్పుడప్పుడు స్టేషను దగ్గరకు వస్తుంది. నిత్యగహన సంచారమువల్లనో, తల్లిపోలికో, తోకకు కుచ్చు బలిసింది. కోరలు వచ్చినై. మనుష్యుని గాలి తగిలితే బృహస్పతి తమ్ముడు సంవర్త మహర్షి వలెనే సీదరించుకొని తొలగిపోతోంది.